విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : బుధవారం సా. 6-20
సహరీ : గురువారం ఉ. 04-50

బీబీఏ అధ్యక్షుడిగా సుందర్

విశాలాంధ్ర-విజయవాడ లీగల్ : బెజవాడ బార్ అసోసియేషన్ (బీబీఏ) అధ్యక్షుడిగా కె.బి.సుందర్ ఎన్నికైయ్యారు.74 ఓట్ల మెజారిటీతో ప్రత్యర్థి బి.డేవిడ్ రత్న కుమార్ పై గెలుపొందారు. ఉపాధ్యక్ష పదవికి పోటీ చేసిన పుప్పాల శ్రీనివాసరావు 170 ఓట్ల మెజారిటీతో ప్రత్యర్థి భార్గవ్‌పై విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా పోటీ చేసిన జన్ను శ్రీధర్ 294 ఓట్ల మెజారిటీతో ప్రత్యర్థి అరిగల శివరామ ప్రసాద్‌పై ఆధిక్యం సాధించారు. సంయుక్త కార్యదర్శిగా పోటీ చేసిన నరహరశెట్టి జ్యోతి 150 ఓట్లు సాధించి ప్రత్యర్థి కొనకళ్ళ మహాలక్ష్మిపై గెలుపొందారు. మహిళా కార్యదర్శి పదవికి పోటీ చేసిన పి.జయలక్ష్మి 8 ఓట్ల మెజారిటీతో ప్రత్యర్థి రాజ్యలక్ష్మిపై గెలుపొందారు. గ్రంథాలయ కార్యదర్శిగా ఆకుల పాండురంగ విఠల్ 168 ఓట్ల మెజారిటీ సాధించి ప్రత్యర్థి పాటిబండ్ల వెంకట అమర్‌నాథ్ పై గెలుపొందారు. కోశాధికారిగా బత్తుల వెంకటేశ్వర్లు 757 ఓట్ల మెజారిటీ సాధించి ప్రత్యర్థి నిడుమోలు వీర వెంకట సుబ్రహ్మణ్యం పై గెలుపొందారు. క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా పగడాల ఆంజనేయులు 670 ఓట్ల మెజారిటీతో కొల్లిపర నవీన్ కుమార్ పై గెలుపొందారని బీబీఏ ప్రధాన ఎన్నికల అధికారి డి.పి.రామకృష్ణ తెలిపారు. మొత్తం 2,436 మంది న్యాయవాదులు ఓటు హక్కు కలిగి ఉండగా వీరిలో 1692 మంది మాత్రమే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నిరుద్యోగ యువత రిజిస్టర్‌కు ప్రత్యేక పోర్టల్

విశాలాంధ్ర-మచిలీపట్నం : జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువత అందర్నీ వారి విద్యార్హతలకు అనుగుణంగా రిజిస్టర్ చేయడానికి ఒక ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేయాలని, అందులో స్కిల్ సెట్ ప్రత్యేకంగా రూపొందించాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మన దేశంలో వ్యవసాయం తర్వాత పరిశ్రమలకే అత్యంత ప్రాధాన్యత ప్రభుత్వం ఇస్తుందన్నారు. పరిశ్రమల అభివృద్ధితోనే జిల్లా ఆర్థికంగా మరింత పరిపుష్టి సాధించి యువతకు మెండైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందుతాయని, పరిశ్రమలు నెలకొల్పేందుకు యువతను పెద్దఎత్తున ప్రోత్సహించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటు, అభివృద్ధికి సహకరిస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ప్రతినెల ఇండస్ట్రియల్ ఎక్స్‌పర్ట్స్ ప్రమోషన్ కమిటీ సమావేశం చేయాలని, జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పడానికి అనుకూలమైన ప్రాంతం అన్నారు. కృష్ణా జిల్లాకు అత్యధిక భూవనరులు ఉన్నాయని మల్లవల్లి, వీరపనేని గూడెం, చల్లపల్లి పామర్రు తదితర ప్రాంతాల్లో పరిశ్రమలకు అనుకూలమైన భూమి ఉందన్నారు. స్కిల్ డెవలప్మెంట్ హబ్‌లు కృష్ణాజిల్లాలో 7 ఏర్పాటు అవుతున్నాయని, తొలుత 3 నియోజకవర్గాల్లో ప్రారంభం కానున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువత రిజిస్టర్ చేయడానికి ఒక ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు నెల రోజుల వ్యవధిలో రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డి ఆర్ డి ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్, స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరావు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వెంకట్రావు, మెప్మా పీడీ శివరాం ప్రసాద్ పలువురు జిల్లా అధికారులు,చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై సంతృప్తి

ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన ప్రపంచ బ్యాంకు బృందం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం పట్ల వరల్డ్ బ్యాంకు కంట్రీ డైరెక్టర్ ఆగస్టీ టానో కౌమే సంతృప్తి వ్యక్తం చేశారు. వరల్డ్ బ్యాంకు కంట్రీ డైరెక్టర్ ఆగస్టీ టానో కౌమే ఆధ్వర్యంలో ప్రపంచ బ్యాంకుల ప్రతినిధుల బృందం, రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జే.నివాస్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు మంగళవారం విజయవాడ భవానిపురంలోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలిచి, ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా అందిస్తున్న వైద్య సేవలు ఆదర్శంగా నిలుస్తాయని మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలని ఆగస్టీ కోరారు. నివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునాతన మౌలిక వసతులు వైద్య పరికరాలు ఏర్పాటుతో పాటు నాణ్యత ప్రమాణాలతో కూడిన వైద్య సేవలు, మందులు అందజేయడం పట్ల వరల్డ్ బ్యాంకు బృందం సంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఆయుష్మాన్‌భారత్ వెల్‌నెస్ కేంద్రాలు డాక్టర్ వైఎస్సార్ పట్టణ గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నట్లు బృందానికి వివరించారు. గ్రామ స్థాయిలో వాలంటీర్లు, ఆశా వర్కర్లు, ఎఎన్‌ఎంలు ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టి ప్రజలకు వైద్యాన్ని చేరువ చేయడం జరిగిందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 48 డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, 257 విలేజ్ హెల్త్ సెంటర్లు, 6 జనరల్ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ బ్యాంకు సభ్యులు, జిల్లా వైద్యాధికారులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ పంపిణీ

విశాలాంధ్ర-అవనిగడ్డ : ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయానికి వచ్చే పాఠకుల సౌకర్యార్థం వాటర్ కూలర్‌ను ఎ.వి.ఆర్. విద్యాసంస్థలు బహుకరించారు. ఎ.వి.ఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ మరియు ఫౌండర్ కీర్తిశేషులు అల్లపర్తి గోపాలకృష్ణ జ్ఞాపకార్థం వారి సతీమణి వెంకట ఝాన్సీ లక్ష్మీ కుమారుడు డాక్టర్ ఉదయ్ కిరణ్‌లు మంగళవారం ఎ వి ఆర్ విద్యాసంస్థల కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ప్రథమశ్రేణి గ్రంథాలయ అధికారి జె ప్రభుదాసుకు వాటర్ కూలర్ ను అందచేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

యాసం శివకు మాతృవియోగం

విశాలాంధ్ర-అవనిగడ్డ : వైసీపీ అవనిగడ్డ సోషల్ మీడియా సభ్యుడు యాసం శివ మాతృమూర్తి మంగళవారం వేకువజామున మృతి చెందింది. విషయం తెలుసుకున్న శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల రైతు విభాగ జోనల్ ఇన్‌చార్జ్ కడవకొల్లు నరసింహారావు, ఎం.పి.పి తుంగల సుమతీ దేవి, జడ్.పి.టి.సి చింతలపూడి లక్ష్మీనారాయణ, మండలపార్టీ అధ్యక్షులు రేపల్లె శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచ్ గాజుల జయగోపాల్ లు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళ్ళు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, మృతికి గల కారణాలను శివ ని అడిగి తెలుసుకున్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

విశాలాంధ్ర-గన్నవరం : కేసరపల్లిలో నేర్సు లక్ష్మమ్మ (47) 27 తేదీన మృతి చెందింది. ఆమె కుటుంబానికి వైఎస్ఆర్ బీమా కింది మృతి చెందిన రోజు రూ.10 వేలు ఇప్పుడు రూ.90 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సర్పంచ్ చేబ్రోలు లక్ష్మి మౌనిక, ఆ వార్డు సభ్యులు మూల్పూరు మాధవన్ మంగళవారం నగదు అందజేశారు. సచివాలయం అధికారి జయ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

విశాలాంధ్ర-పెదపారుపూడి : ఎస్సీ వర్గీకరణకై రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించి, ఆయా కార్యాలయాలలో వినతి పత్రం సమర్పించాలని పిలుపు ఇచ్చిన మేరకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట విజయవాడలో మంగళవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళి, మరోసీనియర్ నాయకుడు కంచర్ల సుధాకర్ ల ఆధ్వర్యంలో కొద్దిసేపు ధర్నా నిర్వహించి అనంతరం డిఆర్‌ఓ కు వినతి పత్రం అందించామని కంచర్ల సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

రిప్రజెంటేషన్‌లో సమస్యలు పరిశీలించాలి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ టైపిస్ట్ కం కంప్యూటర్ ఆపరేటర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ జేఏసీ రాష్ట్ర చైర్మన్ వివిఎస్ దివాకర్ ఆధ్వర్యంలో మంగళ వారం ప్రభుత్వ ముఖ్య సలహా దారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిశారు. రిప్రజెంటేషన్‌లో ఉన్న సమస్యలను పరిశీలించాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ టైపిస్ట్ కం కంప్యూటర్ ఆపరేటర్స్ రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతుల సూరిబాబు, కార్యదర్శి సురేంద్ర, రాష్ట్ర కార్యవర్గం వినతి పత్రం ఇచ్చారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతినెల సక్రమంగా జీతాలు అందేలా చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆదాని నిధులు రక్షణ రంగంలోకి వస్తే పెను ప్రమాదం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : దేశం అంటే అదానీ-అదాని అంటే మోదీ అన్న భావం దేశ ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృతి చేయవలసిన కేంద్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ఉంది, ప్రతిపక్షాలు ఆదాని అంశంపై ప్రశ్నిస్తే వారిని అణచివేసే ధోరణితో ప్రభుత్వం వ్యవహరించడం సరికాదు ఇది దేశానికి మంచిది కాదని ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు నేతి మహేశ్వరరావు తెలిపారు. మంగళవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిండెన్ బర్గ్ ఇచ్చిన నివేదిక కరెక్ట కాదా చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వం లేదా అని ప్రశ్నించారు. డొల్ల కంపెనీలతో ఆదాని పెట్టుబడులపై నివేదికపై స్పందించాల్సిన అవసరం ప్రభుత్వంపై లేదా అన్నారు. రక్షణ రంగాన్ని కూడా మేక్ ఇన్ ఇండియా పరిధిలోకి తీసుకువచ్చి విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదాని కంపెనీలతో లాలూచీ పడిందనుకోవాలి అన్నారు.ఇప్పటికైనా అదానీ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బొప్పన రాజశేఖరరావు,కనకం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కురుబ-కురుమలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : కురుబ-కురుమలను ఎస్టి జాబితాలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ కురుబ, కురుమ, కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. మంగళవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వమించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సామాజిక వర్గం సమాజంలో ఎంతో వెనుకబాటుకు గురి అవుతుందన్నారు. సంచార జాతిగా పిలవబడే తమకు ప్రధాన జీవనాధరం గొర్రెల పెంపకం అందుకోసం అడవుల్లో వర్షానికి,ఎండకు చలికి ఎదురుక్కొంటున్నామన్నారు. ఏప్రిల్ నెలలో లక్ష మంది కురుబ సామాజిక వర్గ ప్రజలతో కుప్పంలో కురుబ మహా గర్జన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కె.మోక్షిత్ పాల్గొన్నారు.

అసత్యప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో దుర్గగుడి ఈవో ఫిర్యాదు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): మధ్యమాల్లో అవాస్తవాలు ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దుర్గగుడి ఈవో డీ.భ్రమరాంబ విజయవాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈనెల 27వతేదీన మెట్రో ఉదయం తెలుగు దిన పత్రిక, ఇతర వాట్సాప్ సామాజిక మధ్యమాల్లో దుర్గగుడి ఈవోపై అవినీతి ఆరోపణలు, అక్రమాలపై దుర్గగుడి ఛైర్మన్ కర్నాటి రాంబాబు' అక్రమాలు బయటకు రాకుండా చూడాలని ప్రాధేయపడుతున్న ఈవో అరగంటపైగానే చైర్మన్‌తో అనే తదితర అవాస్తవాలు సామాజిక మధ్యమాల్లో ప్రచారం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాష్ట్రంలో 2వ అతి పెద్ద ఆలయం ప్రతిష్టకు భంగం కలిగించి, ఉద్యోగుల మనోభావాలను దెబ్బతిసి, పరువు నష్టం కల్పించారని, ఈ అసత్య ఆరోపణలను సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

దేశానికే ఆదర్శంగా పొదుపు సంఘాలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలతో దేశంలోనే రాష్ట్రంలోని పొదుపు సంఘాలు ఆదర్శంగా నిలుస్తాయని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పేర్కొన్నారు. మహిళాసాధికారతే ధ్యేయంగా పథకాలు అమలు చేయడంతో సత్ఫలితాలు వస్తున్నట్లు స్పష్టంచేశారు. మండలంలోని పొదుపు సంఘాలలోని అక్కాచెల్లెమ్మలకు 7,635 మంది డ్వాక్రా సభ్యులకు 9 కోట్ల 35 లక్షల రూపాయల విలువ గల మేగా చెక్కును పంపిణీ చేశారు. వై.యస్.ఆర్ ఆసరా 3వ విడత క్రింద ఈ నిధులను విడుదల చేసినట్లుగా సింహాద్రి తెలిపారు. వై.యస్.ఆర్ ఆసరా ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన బహిరంగ సభలో ఎం.ఎల్.ఎ సింహాద్రి పాల్గొని ప్రసంగించారు. నేడు ప్రగతి పథంలో డ్వాక్రా సంఘాలు ఉన్నాయని ప్రభుత్వం చేపట్టిన చర్యలు పథకాల అమలు కారణంగా పొదుపు సంఘాలు ఆర్థిక వృద్ధి పెరిగిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో నిర్వీరామ దశలో ఉన్న పొదుపు సంఘాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు జీవం పోసాయన్నారు. ముందుగా జోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమానికి మహిళలు పాల్గొనగా ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల రైతు విభాగ జోనల్ ఇన్‌చార్జ్ కడవకొల్లు నరసింహారావు, ఎం.పి.పి తుంగల సుమతీ దేవి, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, జడ్.పి.టి.సి చింతలపూడి లక్ష్మీ నారాయణ, యువనాయకుడు వికాస్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు వైఎస్సార్‌బీమా అందజేత

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడి గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి బండారు సత్యనారాయణ కామెర్లు ముదిరి ఆదివారం మరణించారు. వైయస్సార్ బీమా పథకంలో భాగంగా మట్టి ఖర్చులు నిమిత్తం మృతి చెందిన వ్యక్తి నామిని అయిన బండారు నాగేశ్వరమ్మ (తల్లి)కు సర్పంచ్ కొండవీటి వెంకటరమణ విజయలక్ష్మి, ఆ వార్డు సభ్యుడు పామర్తి బాల శ్రీనివాసరావు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పి ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా రూ.10 వేల చెక్కును మంగళవారం అంద చేసారు. కార్యదర్శి ఇస్లావతుభవాని పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు.

విశాలాంధ్ర-కూచిపూడి : ఈనెల 15వ తేదీ నుంచి మొదలైన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు మంగళవారంతో ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. మొవ్వ క్షేత్రయ్యప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముగింపు పరీక్ష రోజున సిట్టింగ్ స్క్వాడ్ పరీక్షలు జరిగనంత సేపు(ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు) పరీక్ష గదులలో నిఘానిర్వహించగా, ఫ్లయింగ్ స్క్వాడ్ పరిశీలించి వెళ్ళిపోయారు. 135 మందికి నలుగురు ఆబ్సెంట్ అవ్వడంతో 131 మంది హాజరైనట్లు సిఎస్ కె కిరణ్ కుమార్, డిఓ ఎల్ హిరణ్మయి తెలిపారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సహకారం

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లో సభ్యుడైన రైతు మురారి వెంకటేశ్వరరావు (పెదపూడి) ఇటీవల చని పోయారు. ఆ రైతు అంత్యక్రియల (మట్టి ఖర్చులు) నిమిత్తం అతని భార్య వెంకటరత్నంకు రూ.10 వేల ఆర్థిక సహకారాన్ని మంగళవారం ఆ సొసైటీ అధ్యక్షురాలు కైల శ్రీవల్లి అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో కట్టా వెంకటరమణ, పామర్రు పాలసీతల కేంద్రం సూపర్‌వైజర్ కైలా రమేష్, రైతు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చుక్కల భూములకు పట్టాలు పంపిణీ

విశాలాంధ్ర-పమిడిముక్కల : తాడంకి గ్రామంలో చుక్కల భూములకు రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు వీలుగా ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మంగళవారం పట్టాలు పంపిణీ చేశారు. తాడంకి లో 22ఎ పట్టాభుములను చుక్కల భూముల్లో పెట్టిన రిజిస్ట్రేషన్ కాకుండా ప్రభుత్వం జి.ఒ. ఇవ్వటంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నామని గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే కైలే దృష్టి కి తీసుకు వెళ్ళంతో స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాతానని ఆయన తెలిపారు. ప్రభుత్వం చుక్కల భూములపై నిషేధం ఎత్తివేయడంతో రెవిన్యూ అధికారులు ద్వారా గ్రామస్తులకు రత్తాలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంపాన ధనలక్ష్మి తాసిల్దార్ డి రాజ్యలక్ష్మి ఎంపీడీవో సుధా ప్రవీణ్ ఎంపీపీ కాసాని వేద సుప్రజ వైఎస్ యంపిపి కొడమంచిలి మహేష్ గంజాల సీతారామయ్య వైసీపీ నాయకులు యేనుగ మస్తాన్రావు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ ప్రాంతం తనిఖీలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ రూరల్ మండలం కొత్తూరు-తాడేపల్లి రిజర్వ్ ఫారెస్ట్, జక్కంపూడి ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ ప్రదేశాలను మంగళవారం విజయవాడ సబ్ కలెక్టర్ అతిధి సింగ్ పరిశీలించారు. కొత్తూరు రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి గ్రామాల పరిధిలో జరిగిన అక్రమ మైనింగ్ కార్యకలాపాలపై మాజీ సైనికుడు పిల్లి సురేంద్రబాబు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి)లో ఓఎ నెం.53/2023 పిటిషన్‌ను దాఖలు చేశారు. పిటిషన్‌ను విచారించిన ఎన్‌జిటి, పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ, చెన్నై రీజియన్ ఆఫీస్ పర్యవేక్షణలో అక్రమ మైనింగ్ ప్రాంతాలను తనిఖీ చేయడానికి కమిటీని ఏర్పాటు చేసింది. కాగా ఎన్టీఆర్ విజయవాడ సబ్‌కలెక్టర్ అదితి సింగ్‌తో పాటు మైనింగ్, ఫారెస్ట్ అధికారులు కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడిలలో అక్రమ మైనింగ్ స్థలాలను పరిశీలించింది. సమీపంలోని పోలవరం కాలువ వద్ద నుంచి తనిఖీలు ప్రారంభించి అక్రమ మైనింగ్ జరుగుతున్న అన్ని ప్రాంతాలను సందర్శించారు. కొత్తూరు రిజర్వ్ ఫారెస్ట్ వద్ద అక్రమ మైనింగ్ స్థలాలను సందర్శించి వీడియోలు తీశారు. రైతులతో మాట్లాడి అక్రమ మైనింగ్‌పై వారి అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తహశీల్దార్ జాహ్నవి, ఫారెస్ట్, మైనింగ్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు. కొత్తూరు తాడేపల్లి లో అక్రమంగా పోలవరం మట్టిని తరలిస్తున్నారు.ఇదిలావుండగా హైకోర్టు ఆదేశాల ను కూడా లెక్కచేయకుండా ఇష్టానుసారంగా పోలవరం మట్టిని తరలిస్తున్నారని సబ్ కలెక్టర్ కు తాడేపల్లి గ్రామస్తులు వినతి పత్రం ను అందజేశారు. పోలవరం మట్టిని త్రవుతున్న ఏరియాలో పోలవరం (ఇరిగేషన్)అధికారులు మాత్రం రావటంలేదని చెప్పారు.

పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మంచినీటి ట్యాంకర్లు

- రూ.252.50 లక్షల ఎంపీ నిధులతో 113 గ్రామాలకు

విశాలాంధ్ర-విజయవాడ : విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని తిరువూరు, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గ గ్రామాలకు త్రాగునీటి సమస్య పరిష్కారం కొరకు మొదటి విడతగా 113గ్రామ పంచయితీలకు ఎంపీ నిధుల రూ. 252.50 లక్షల రూపాయలతో త్రాగునీటి ట్యాంకర్లను మంజూరు చేసిన ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) మొదటి విడతలో తాగునీటి ట్యాంకర్లు మంజూరైన గ్రామాలు నెమలి,లింగాల, గంపలగూడెం, దుందిరాలపాడు, ఉమ్మడిదేవరపల్లి, పెనుగొలను, తునికిపాడు, చిట్యాల, లక్ష్మీపురం, అక్కపాలెం, చింతలపాడు, ముష్టికుంట్ల, వావిలాల, వామకుంట్ల, కొమ్మిరెడ్డిపల్లి, చౌటపల్లి, మల్లెల, ఎరికేపాడు, మారేపల్లి, గొల్లమందల, పోలిశెట్టిపాడు, చిమలపాడు పెద తాండ, కంభంపాడు, గొల్లమందల తాండ, మాత్రేయ తాండ, కెసియా తాండ, ఏ.కొండూరు, ఏ.కొండూరు తాండ, కుమ్మరి కుంట్ల, గోపాలపురం, వల్లంపట్ల, జీలకుంట్ల, మాధవరం, చీమలపాడు, తెల్లదేవరపల్లి, చంద్రుపట్ల, విస్సన్నపేట, వేమిరెడ్డిపల్లి., కొండపల్లి మునిసిపాలిటి: 6వాటర్ ట్యాంకర్లు మద్దులపర్వ, అన్నారావుపేట, చిలుకూరు, కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, గొల్లపూడి, రాయనపాడు, మైలవరం, పొందుగల, పుల్లూరు, రెడ్డిగూడెం, కూనపరాజుపర్వ, రంగాపురం., ముప్పాళ్ల, మునగచెర్ల, పోపూరు, కోనాయపాలెం, ఏటూరు, మున్నలూరు, పెండ్యాల, గని ఆత్కూరు, గుడిమెట్ల, విపరింతలపాడు, వేలదికొత్తపాలెం, పున్నవల్లి, చందర్లపాడు, చింతలపాడు, తుర్లపాడు, చెవిటికల్లు, గండేపల్లి, కంచికచర్ల మోడల్ కాలనీ, కంచికచర్ల అంబెడ్కర్ కాలనీ, కీసర, కునికినపాడు, మొగులూరు, పరిటాల, ఎస్.అమరావరం, వేములపల్లి, అల్లూరు, గోకరాజుపల్లి, వెల్లంకి., బండిపాలెం, తక్కెళ్లపాడు , ఇందుగుపల్లి, కాకరవాయి, ముక్త్యాల, వెంగనాయకునిపాలెం, శివాపురం, శెనగపాడు, ముంగొల్లు, భీమవరం, వత్సవాయి, కంభంపాడు, వేమవరం, కొండూరు, తొర్రగుడిపాడు, మాగల్లు, కొణతమాత్మకూరు, గొల్లమూడి, పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు, వెంకటాపురం, పోచవరం, జయంతిపురం, ఎస్.ఎం. పేట, చిల్లకల్లు గ్రామాలు ఉన్నాయి.

దళితులపై దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రిజర్వేషన్లు నుండి రాజ్యాధికారం వరకు,పంచాయితీ నుండి పార్లమెంట్ వరకు వెళ్ళటమే లక్ష్యంగా మాదిగలను చైతన్యం తీసుకురావటమే లక్ష్యంగా ఏపి మాదిగ జె.ఎ.సి ముందుకు వెళ్ళుతుందని జేఏసీ వ్యవస్థాపక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.కృపాకర్ మాదిగ తెలిపారు. మంగళవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వమించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 27న మంగళగిరిలో రాష్ట్ర స్థాయి సమావేశంలో ఏబిసిడి వర్గీకరణ సబ్ ప్లాన్ నిధులు మళ్లింపు అట్రాసిటీ చట్టం, నిలిపివేసిన 28 ఎస్సీల పథకాలు, వంటి అంశాలపై 18 తీర్మానాలను ప్రభుత్వానికి పంపామని తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు అయ్యేలా కృషి చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో వెలుగుబడిన వర్గాలపై దాడులు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ,ఎస్టీ వర్గాల ప్రజలపై దాడులకు తెగబడ్డ వారిని కఠినంగా శిక్షించాలన్నారు.ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. మహిళా ఎమ్మెల్యే క్రాస్ ఓటింగ్ కి పాల్పడిందని ఎటువంటి ఆధారాలు లేకపోయినా కక్షగట్టి రాష్ట్ర ప్రభుత్వం ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేసి తీవ్ర ఇబ్బందులు పెడుతుందని మండిపడ్డారు.

కోటి రుద్రాక్షకు గిన్నీస్‌రికార్డు

విశాలాంధ్ర-విజయవాడ : కోటి రుద్రాక్షలతో అభిషేకం చేయటం మామూలు విషయం కాదని లోక కళ్యాణార్థం బాబా మందిరంలో కోటి రుద్రాక్ష అభిషేకం చేయటం అపూర్వమని విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామి అన్నారు. ఆంధ్రాషిరిడీగా విరాజిల్లుతున్న ముత్యాలంపాడు శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో మంగళవారం కోటి రుద్రాక్ష అభిషేకంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక కళ్యాణార్థం వ్యయప్రయాసలతో కూడుకున్న ప్పటికీ ఇంత మంచి కార్యక్రమం నిర్వహిస్తున్న మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డిని అభినందించారు. అష్టాక్షరీ స్వామీజీ, శ్రీ వాసుదేవానందగిరి స్వామీజీ చైతన్యతపోవనం పీఠాధిపతి మాతా శివచైతన్య, అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారామ్ దంపతులు, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, ఏపీ ప్రణాళికాబోర్డు వైస్ చైర్మన్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, పొన్నూరు ఎమ్మెల్యే కిల్లారు రోశయ్య, జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఏపీ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోసాని కృష్ణమురళి, గాయకులు గజల్ శ్రీనివాస్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ శివరామకృష్ణ తదితరులు పూజలు చేశారు. కోటి రుద్రాక్ష అభిషేకం కార్యక్రమాన్ని ఇంటర్నేషనల్ బుక్‌ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్‌బుక్‌ఆఫ్ రికార్డ్స్‌లలో నమోదు చేశారు.

అసభ్య పదజాల పోస్టులపై స్పందించాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : తాడికొండ ఎం.ఎల్.ఎ ఉండవల్లి శ్రీదేవిపై అసభ్య పధజాలంతో పెడుతున్న పోస్టులపై రాష్ట్ర హోంశాఖ ఎస్.సి కమీషన్‌లు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా మాలమహనాడు అధ్యక్షుడు దోవా గోవర్ధన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దళిత మహిళ తాడేపల్లి శాసనసభ్యురాలు ఉండవల్లి శ్రీదేవి, వారి ఇరువురి కుమార్తెలను కొంత మంది అధికార పార్టీ సానుభూతి పరులు ఇటీవల జరిగిన ఎం.ఎల్.సి ఓట్ల విషయంలో తీవ్ర అసభ్య పధజాలంతో దూషిస్తూ అవమానకరంగా సోషల్ మిడియాలో ఫోటోలను ప్రచారం చేస్తుంటే రాష్ట్రంలో దిశాచట్టం ఏం చేస్తుందని గోవర్ధన ప్రశ్నించారు. చట్టాలు వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం కలిగేలా ప్రతి వ్యవస్థ స్వయం ప్రతిపత్తితో వ్యవహరించి ఇటివంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని దోవా అన్నారు.

'పది' విద్యార్థులకు ఉచిత ప్రయాణం

విశాలాంధ్ర-గుడివాడ : పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పచేస్తున్నట్లు గుడివాడ ఆర్టీసీ డిపో మేనేజర్ రాజేష్ కుమార్ తెలిపారు. మంగళవారం అయన కలసిన విలేకర్లుతో అయన మాట్లాడుతూ రవాణా వసతులు లేని ఏరియాలకు ప్రత్యేకంగా బస్సు సర్వీసులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పదో తరగతి పరీక్షల్లో పాల్గొనే విద్యార్థినీలకు ఆర్టీసీ ఉచిత రవాణా సేవలు అందిస్తుందన్నారు.

గుడివాడ పరిసర ప్రాంతాల్లో రవాణా వసతులు తక్కువగా ఉండే మోపర్రు, చిగురుకోట, దోసపాడు తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు ఇప్పటికే ఉచితంగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. 10వ తరగతి హాల్ టికెట్ ఉన్న ప్రతి ఒక్క విద్యార్థి పరీక్షలు ముగిసే వరకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు 'పది' ప్రశ్నాపత్రాలు

విశాలాంధ్ర-కూచిపూడి : ఈఏడాది ఏప్రిల్ 3 నుంచి నిర్వహించే పదవ తరగతి పబ్లిక్ పరీక్షానికి సంబంధించి ప్రశ్నాపత్రాలు సెట్-2 మంగళవారం పోలీస్ స్టేషన్ కి వచ్చాయి. ఈ మండలంలోని కూచిపూడి, మొవ్వ, కోసూరు, కాజ, పెడసనగల్లు లలోని ఆరు కేంద్రాల కస్టోడియన్‌ఆఫీసర్స్ వాటిని సంబంధించిన బాక్స్ లలో పొందుపరిచి పోలీస్ స్టేషన్లో భద్రపరిచారు. ఈ కార్యక్రమాన్ని కూచిపూడి ఎస్సై డి సందీప్ పర్యవేక్షణలో కొనసాగింది.

శివ నాగిరెడ్డిని సత్కరించిన శాప్ వీసీఎండీ

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: ఈ నెల 20 నుండి 23 వ తేది వరకు అస్సాంలో జరిగిన నాల్గవ అంతర్జాతీయ ఆసియా ఖోఖో ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా, పంగులూరు గ్రామానికి చెందిన అట్ల శివ నాగిరెడ్డి, భారత ఖోఖో జట్టు తరపున పాల్గొని బంగారు పతకం సాధించాడని, శాప్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కే హర్షవర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం శాప్ కార్యాలయంలో శివ నాగిరెడ్డిని సత్కరించారు.

వేణుగోపాలస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.14,55,659

విశాలాంధ్ర-గంపలగూడెం : వేణుగోపాల స్వామి వారి దేవాలయంలో గల హుండీలను మంగళవారం ఈ నెల 4 నుండి 28 వరకు స్వామివారి హుండీలో భక్తులు వేసిన కానుకలను లెక్కించగా రూ.14,55,659లు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ డి ఎస్ వి ప్రసాద్ రావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కాపూరి శశిరేఖ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సీపీఐ ఉద్యమానికి అఖిలపక్షాల మద్దతు

-రెండవ రోజు కొనసాగిన నిరసన దీక్షలు
-పోలవరం అంశంలో అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లాలి
-ఢిల్లీ స్థాయిలో ఉద్యమానికి కార్యాచరణ
-సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు నిర్మాణం అంశంపై లోకసభలో ఒక విధంగా, రాజ్యసభలో మరో విధంగా సమాధానం చెపుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల్ని మోసం చేస్తుందని అఖిలపక్షాల నేతలు తీవ్రస్థాయిలో విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు 41.5 అడుగులకు కుదిస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న విధంగా జాతీయ ప్రాజెక్టుగా నిర్మించాలి డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఉద్యమం రెండవ రోజు కొనసాగింది. దానిలో భాగంగా మంగళవారం సీపీఐ ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ నగర సమితుల ఆధ్వర్యంలో విజయవాడ లెనిన్ సెంటర్‌లో నిరసన దీక్షలను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రారంభించారు. సీపీఐ పోరాటానికి అఖిలపక్ష పార్టీల నేతలు పాల్గొని సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ పోలవరం ఎత్తు తగ్గిస్తున్నారనే సమాచారంతో రాష్ట్ర ప్రజలు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసే అంశాలపై ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. తన తండ్రి శంకుస్థాపన చేసిన ప్రాజెక్టును తాను పూర్తి చేస్తానని అసెంబ్లీలో ప్రకటించిన సీఎం జగన్ మాట నిలబెట్టుకోవాలన్నారు. లేని పక్షంలో పోలవరం ఎత్తు తగ్గిస్తే చరిత్రహీనుడుగా జగన్ మిగులుతాడని హెచ్చరించారు. పోలవరానికి నిధులు రాబట్టి ప్రాజెక్టు పూర్తి చేయటం సీఎం ఒక్కడివల్ల అయ్యే పనికాదని అఖిలపక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకెళ్లాని సీఎంకు సూచించారు. రైతు సంఘాల నాయకులతో చర్చించి పోలవరం పూర్తిస్థాయి నిర్మాణం చేయాలనే డిమాండ్‌తో భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు చెప్పారు.

గేటు కూడా పెట్టలేని వారు ప్రాజెక్టు ఎలా నిర్మిస్తారు : దేవినేని ఉమా

మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పోలవరం కోసం టీడీపీ అధికారంలో ఉండగా ఐదేళ్లలో 68వేల కోట్లు ఖర్చుచేసి 71శాతం పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత డ్యామ్‌సైట్‌లో 15 నెలల పాటు ఎలాంటి పనులు చేయకుండా గాలికొదిలేశారన్నారు. నేషనల్ వాటర్ కౌన్సిల్(సీడబ్ల్యూసీ), హైదరాబాద్ ఐఐటీ వారు వచ్చి చెప్పేవరకు పోలవరం ప్రాజెక్టు పరిస్థితి సీఎంకుగాని, అధికారులకుగాని తెలియదన్నారు. సీపీఐ రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను సందర్శించి అక్కడ పరిస్థితులను పరిశీలించి అనంతరం అన్ని పార్టీలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి ఏ ప్రాజెక్టుకు ఎంత నిధులు కేటాయించాల్సి ఉందో చర్చించి ఒక నివేదికను రాష్ట్ర ప్రభుత్వంకు అందించారని గుర్తు చేశారు. సీపీఐ చేస్తున్న పోరాటానికి తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు.

గిరిజనులకు అన్యాయం : సీహెచ్.బాబూరావు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్.బాబూరావు మాట్లాడుతూ గిరిజనులకు పునరావాసం లేకుండా చేయాలనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. 138 అడుగుల ఎత్తు నీరు వస్తేనే పోలవరం కాంటూరు ముంపుకు గురైయిందని గుర్తు చేశారు.

పూర్తిస్థాయి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి: గిడుగు రుద్రరాజు

ఏపీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ రాష్ట్ర పునర్విభజన చట్టం ద్వారా పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ఏర్పాటు చేస్తే టీడీపీ, వైసీపీ ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా కేంద్రం 10శాతం నిధులు కూడా ఇవ్వలేదన్నారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గించటం ద్వారా గతంలో పేర్కొన్న నిర్వాసితులకు కూడా పరిహారం చెల్లించాల్సిన అవసరం లేకుండా తప్పించుకుంటున్నారని చెప్పారు. పూర్తిస్థాయిలో పోలవరం నిర్మించటానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డ్యాన్సులేసే వారు డ్యామ్‌లు ఎలా కట్టగలరు: పోతిన మహేష్

జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన మహేష్ మాట్లాడుతూ 41 మీటర్ల ఎత్తుకు కుదిస్తే జీవనాడి చచ్చిపోతుందన్నారు. పోలవరం అంచనాలకు పదేపదే కేంద్రం ఎందుకు సవరిస్తుందని అనుమానం వ్యక్తం చేశారు. డ్యాన్సులేసే వారు మంత్రులుగా ఉంటే డ్యామ్‌లు ఎలా నిర్మిస్తారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌కు జగన్ అమ్ముడుపోయాడనే అనుమానం కలుగుతుందన్నారు. ఎత్తుతగ్గిస్తే బ్యారేజీగా కూడా పోలవరం ఉపయోగపడదన్నారు.

ఎత్తు తగ్గించే హక్కు ఎవరికీ లేదు : భవానీప్రసాద్

రైతు సంఘం నాయకులు అక్కినేని భవానీప్రసాద్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించే హక్కు ఎవరికీ లేదని కేవలం బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రగా అభివర్ణించారు. రాష్ట్రంలో నీటి వనరులను సద్వినియోగం చేసుకోవటం, వ్యవసాయం అభివృద్ధి, పరిశ్రమల అవసరాలు తీర్చటం కోసం పోలవరాన్ని డిజైన్ చేయటం జరిగిందని వివరించారు. పోలవరం పూర్తి స్థాయిలో నిర్మాణం కావటం కోసం అన్ని రాజకీయ పక్షాలు ఐక్య ఉద్యమాల ద్వారానే సాధ్యమవుతుందన్నారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై సీపీఐ జాతీయ సమితి కార్యవర్గ వర్గ సభ్యులు అక్కినేని వనజ, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు, డిప్యూటీ కార్యదర్శి దోనేపూడి శంకర్, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా నాయకులు తూము కృష్ణయ్య, విజయవాడ నగర సహాయ కార్యదర్శి లంక దుర్గారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా నాయకులు బుడ్డి రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బాణావతు పెదబాలు నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఉప్పె నరసింహారావు, తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్.నాగుల్‌మీరా, గిరిజన సమాఖ్య నాయకులు అంగోతు నాగునాయక్, విజయవాడ నగర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ముందుగా ప్రజానాట్య మండలి విజయవాగ నగర అధ్యక్షులు ఎస్‌కె.నజీర్ విప్లవ గేయాలు ఆలపించారు. నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు వందన సమర్పణ చేశారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేయాలి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : స్వరాజ్య మైదానంలో ఎంతో అద్భుతంగా నిర్మాణం జరుగుతున్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబందిత అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాజ్య మైదానంలో జరుగుచున్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనుల్లో అత్యంతా నాణ్యత ప్రమాణాలు పాటించాలని క్వాలిటీ కంట్రోల్ అధికారులను ఆదేశించారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఎపీఐఐసీ అధికారులు, కేపీసీ ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

వాల్ ఆఫ్ కైండ్ నెస్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : స్వచ్ఛ సర్వేక్షన్ 2023లో భాగంగా వాల్ ఆఫ్ కైండ్ నెస్‌ను నగర పాలక సంస్థ ఏర్పాటు చేసినట్లు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. అలంకార్ సెంటర్‌లో ధర్నా చౌక్ పక్కనున్న వాల్ ఆఫ్ కైండ్ నెస్, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కేంద్రంలో స్వచందంగా నగర పాలక సంస్థ ఉద్యోగస్తులు దానమిచ్చిన వస్తువులను నిరాశ్రయులకు అందజేసి, ప్లాస్టిక్ వ్యర్థాలను దానమిచ్చిన వారికి కంపోస్ట్ బాగ్‌లను మేయర్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాల్ ఆఫ్ కైండ్ నెస్ అనగా ఒక స్వచంద దాన కార్యక్రమమని, ప్రజలు ఎవరయితే తమ వద్ద ఉన్న పాత, వాడని లేదా దానం చేయాలి అనుకున్న వస్త్రాలు, పిల్లల బొమ్మలు, పుస్తకాలు దానం చేయవచ్చని తెలిపారు.

పొంగళ్ల షెడ్లను పరిశీలించిన ఈఓ

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలోని పొంగల్ షెడ్లు ఖాళీగా ఉన్న పరిసర ప్రాంతాలను ఆలయ ఈఓ జీవిడి ఎన్ లీలాకుమార్ మంగళవారం పరిశీలించారు. రిపేర్లు చేయుటకు ఇంజనీరింగ్ విభాగం వారికి తగిన సూచనలు సలహాలు ఇచ్చి ఆదేశాలు జారీ చేసినారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజు, కార్యాలయ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రాస్ నిర్మూలనపై అవగాహన

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : మండల పరిషత్ కార్యాలయంలో వయ్యారి భామ గ్రాస్ నిర్మూలనకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్కపుడి గాంధీ. జెడ్.పీ.టీ సి. వుట్లా. నాగమణి, వ్యవసాయ శాఖ అధికారి, పశు సంవర్ధక శాఖ అధికారి, మెడికల్ ఆఫీసర్, పరిపాలన అధికారి వివిధ సచివాలయ సిబ్బంది హాజరయ్యారు.

ప్రొపెల్ స్టార్టప్ యాక్సిలరేటర్ సీజన్ 3ని ప్రకటించిన అమెజాన్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అమెజాన్ గ్లోబల్ సెల్లింగ్ ప్రొపెల్ స్టార్టప్ యాక్సిలరేటర్ మూడవ సీజన్‌ను ప్రారంభించినట్లు అమెజాన్ ఇండియా ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వినియోగదారులను చేరుకునేందుకు అభివృద్ధి చెందుతున్న భారతీయ బ్రాండ్‌లు, స్టార్టప్‌లకు అంకితమైన మద్దతును అందించేలా దీన్ని డిజైన్ చేశారు. ప్రొపెల్ ఎస్3 అంతర్జాతీయ మార్కెట్‌లలో 50 డీ2సీ స్టార్టప్‌లను ప్రారంభించేందుకు మద్దతు ఇవ్వడంతో పాటు భారతదేశం నుంచి గ్లోబల్ బ్రాండ్‌లను సృష్టిస్తుంది. టాప్ 3 విజేతలు కూడా ఈక్విటీ ఫ్రీ గ్రాంట్‌లో కలిపి 100కె డాలర్లు పొందుతారు. పోటీలో పాల్గొనే స్టార్టప్‌లకు క్లబ్, వెలాసిటీతో సహా రెవెన్యూ ఆధారిత ఫైనాన్సింగ్ సంస్థలతో కనెక్ట్ అవ్వడానికి కూడా అమెజాన్ సహాయం చేస్తుంది. వారు పాల్గొనే స్టార్టప్‌లకు తమ వ్యాపారాన్ని తగిన స్థాయిలో విస్తరించేందుకు క్యూరేటెడ్ ఆఫర్‌లను అందిస్తారు.

జీ తెలుగు డ్రామా జూనియర్స్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): జీ తెలుగులో సరికొత్త ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు ఎల్లప్పుడూ ముందుండే జీ తెలుగు ఇప్పుడు డ్రామా జూనియర్స్ సరికొత్త సీజన్తో మీ ముందుకు వచ్చేస్తోంది. తెలుగు రాష్ట్రాల్లోని పిల్లల్లోని నటనా ప్రతిభను వెలుగులోకి తెచ్చే లక్ష్యంతో డ్రామా జూనియర్స్ సీజన్ 6 ప్రారంభించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. ఇప్పటికే విజయవంతంగా 5 సీజన్లను పూర్తి చేసుకున్న డ్రామా జూనియర్స్ మరో సీజన్తో తెలుగు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. అంతేకాదు ప్రతిభగల గాయనీ గాయకులనూ ఆడిషన్ ఆహ్వానిస్తోంది. - డ్రామా జూనియర్స్ సీజన్ 6 కోసం తెలుగు రాష్ట్రాల్లో నటనపై ఆసక్తిగల చిన్నారులతో పాటు సంగీతంపై మక్కువ గల వారికీ ఇదే చక్కని అవకాశం.

అన్ అకాడమీ స్కాలర్‌షిప్ టెస్ట్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): పోటీ పరీక్షల్లో అద్భుతమైన విజయాలు సొంతం చేసుకోవాలనుకుంటున్న విద్యార్థులు అన్ అకాడమీ కార్యక్రమాల ద్వారా తమ కలలను సాకారం చేసుకుంటున్నారు. అందుకోసమే విద్యార్థుల కోసం అన్ అకాడమీ స్కాలర్ షిప్ టెస్ట్ (యూఎస్‌టీ) నిర్వహిస్తోంది. ఇప్పుడు మరోసారి విద్యార్థుల కోసం ఈ టెస్ట్ ని నిర్వహిస్తోంది. ఈ పరీక్ష మార్చి 26 నుంచి ఏప్రిల్ 16 వరకు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు, అలాగే సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు.

వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-వీరులపాడు : మహిళ సాధికారతే లక్ష్యంగా వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు అన్నారు. జుజ్జూరు జెడ్పీ పాఠశాలలో "వైఎస్ఆర్ అసరా పథకం" లో భాగంగా మూడో విడత డ్వాక్రా మహిళలకు మంజూరైన నగదు చెక్కును మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి,గ్రామ సర్పంచ్ రమావత్ కోటి,ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ కోటేరు మల్లేశ్వరి, జెడ్పీ టీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షహనాజ్ బేగం, , మండల పార్టీ కన్వీనర్ ఆవుల రమేష్ బాబు నాయకులు పాల్గొన్నారు.

సిరిధాన్యాలతో రక్తహీనతకు చెక్

విశాలాంధ్ర-తిరువూరు: గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు పోషక విలువలు కలిగిన సిరిధాన్యాలు వాడటం వల్ల రక్తహీనతకు చెక్ పెట్టవచ్చునని తిరువూరు అమరావతి హాస్పిటల్స్ గైనకాలజిస్టు డాక్టర్ మధు కీర్తి అన్నారు. పోషణ్ పక్వాడ పక్షోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ తిరువూరు ప్రాజెక్ట్ సమావేశం స్థానిక షాదీకానాలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ మధు కీర్తి మాట్లాడుతూ మాతా శిశు సంక్షేమమే దేశ సౌభాగ్యమని, అంగన్వాడీ కేంద్రాలలో అధిక పోషక విలువలు ఉన్న రాగులు, జొన్నలు, సజ్జలు వంటి ఆహారం ఇవ్వడం ద్వారా ఆరోగ్యవంతమైన శిశువులు జన్మిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో జీ సత్యవతి, ఏసీడీపీవో జీ ఝాన్సీ, సూపర్వైజర్ లు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

విశాలాంధ్ర-తిరువూరు: వాతావరణ మార్పులు వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గద్దల భారతి సూచించారు. మండలంలోని చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. హాస్పిటల్‌లో రోగులకు అందుతున్న సౌకర్యాలను ఆమె పరిశీలించారు. కార్యక్రమం వైద్యధికారులు డాక్టర్ సీ హెచ్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ పూజిత, సీనియర్ అకౌంటెంట్ కృష్ణప్రసాద్, సీహెచ్వో దీవెనమ్మ.. ఎన్జీవో సంఘ నాయకులు జీ ఏసురత్నం పాలకొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల పన్నులు వసూలు చేస్తాం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిలను త్వరలోనే వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్ అన్నారు. పన్నుల వసూళ్లపై సమీక్ష నిర్వహించేందుకు మంగళవారం విస్సన్నపేట వచ్చిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. పలు ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ఇంటి పన్ను బకాయిలు పెద్దమొత్తం వసూలు కావలసి ఉందని, వీటి వసూళ్లకు అవసరమైతే న్యాయపరమైన చర్యలు చేపట్టనున్నామన్నారు. విస్సన్నపేట మండలంలో ఇంటి పన్ను బకాయిలు రూ.1.40కోట్లు ఉండగా, రూ.1.08కోట్లు మాత్రమే వసూలయ్యాయన్నారు. గ్రామాల్లో ఖాళీ స్థలాలు పెద్దమొత్తంలో ఉండటం ద్వారా పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయని, సమస్యల పరిష్కారం దిశగా స్థల యజమానుల నుంచి జరిమానాలు వసూలు చేసి, పారిశుధ్య పరిస్థితుల మెరుగు చేపడతామన్నారు.

వయ్యారిభామ మొక్కను నివారించుకుందాం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: వయ్యారిభామ పేరు కలిగిన కలుపు మొక్కను సమిష్టిగా నిర్మూ లించుకుందామని ఏఓ రాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మండలపరిషత్తు కార్యాలయంలో ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కలుపు మొక్క నివారణ దిశగా ఈనెల 29వ తేదీన అన్నిశాఖల ఆధ్వర్యంలో కార్యాచరణ చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. వయ్యారిభామ కలుపు మనుషులు, పశువులతోపాటు మానవా ళికి ఉపయోగపడే వృక్షజాలం ప్రాణాలపై కూడా ప్రభావం చూపుతోందన్నారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి ఈ కలుపు మొక్క కారణంగా మనుషుల్లో తలెత్తే వివిధ రుగ్మతలను వివరించారు. గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి ఎం.ఝాన్సీలక్ష్మి అన్ని పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులతో కలసి కలుపు నివారణ చర్యల్లో పాలు పంచుకోనున్నామన్నారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు కాలేజీని సందర్శించిన నాక్ బృందం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రాంగణాన్ని యూజీసీ నియమించిన నాక్ బృందం పరిశీలించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. కళాశాల ర్యాంకింగ్ నిర్ణయం కోసం యూజీసీ అనుబంధ సంస్థ నేషనల్ అసిస్మెంట్ అండ్ అక్రిటేషన్ కౌన్సిల్ (నాక్) నియమించిన త్రిసభ్య కమిటీ సోమ, మంగళవారాల్లో కళశాలను సందర్శించినట్లు పేర్కొన్నారు. కళాశాల అనుసరిస్తున్న బోధనా పద్ధతులు, విద్యార్థుల ప్రతిభ, నైపుణ్యాలు అనుసరించే ఇతర కార్యక్రమాలు తదితర అంశాలపై బృందం పరిశీలన చేసినట్లు వివరించారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రముఖులతో కూడిన త్రిసభ్య కమిటీ ఎగ్జిట్ మీట్‌లో విద్యార్థులను మరింత సమర్ధవతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారని వివరించారు. కార్యక్రమంలో కళాశాల యజమాన్యం పాల్గొన్నారు.

ఎన్‌టీటీపీఎస్‌లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తనిఖీలు

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : కొండపల్లి లోని హజరత్ సయ్యద్ షాబుకారి దర్గా ప్రాంతంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ బృందం పరికరాలతో శాంపిల్స్ సేకరించి తనిఖీలు నిర్వహించింది. నార్ల తాతారావు ధర్మల్ పవర్ స్టేషన్ పొల్యూషన్ కారణంగా కొండపల్లి హజరత్ సయ్యద్ షాబుకారీ దర్గాకు వచ్చే భక్తులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రని దర్గా కమిటీ పొల్యూషన్ బోర్డుకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు తనిఖీకి వచ్చిన అధికారులు ఎన్‌టీపిఎస్‌కు ముందస్తు సమాచారం ఇచ్చి ఎన్‌టీటిపిఎస్‌కు చెందిన వాహనంలో తనిఖీలకు రావటం పలు అనుమానాలకు తావిస్తోంది. దర్గా ఎన్‌టిటిపిఎస్‌తో సమస్యలను పలుమార్లు దృష్టికి తీసుకువెళ్లి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని, కానీ ఈరోజు పొల్యూషన్ బోర్డ్ అధికారులు వస్తున్నారన్న ముందస్తు సమాచారంతో దర్గా కు వెళ్లే రహదారి మొత్తాన్ని నీళ్లలో నీళ్లతో తడపటం ఆశ్చర్యానికి గురి చేసిందని దర్గా కమిటీ తెలిపింది ఈ కార్యక్రమంలో కమిటీ సెక్రటరీ న్యాయవాది మసూద్ అలీ, జిన్నా దర్గా ముతవల్లి షాజహా, బాబు బాజీ సయ్యద్ కాజా, అల్తాఫ్ రజా తదితరులు పాల్గొన్నారు.

నగర పోలీస్ కమీషనరేట్ పరిధిలో సెక్షన్ 30 పోలీస్‌యాక్ట్ 1861 ప్రకారం నిషేధాజ్ఞలు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: ఎన్టీఆర్ జిల్లా నగర పోలీస్ కమీషనరేట్ పరిధిలో ప్రజా జీవనానికి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఉండేందుకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా సజావుగా శాంతిభద్రతలు పరిరక్షించదానికి పోలీస్ కమీషనర్, మెట్రోపాలిటన్ ప్రాంత అదనపు జిల్లా మేజిస్ట్రేట్ కాంతి రాణా టాటా నగర పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఏప్రిల్ 1వతేదీ నుంచి జూన్ 30వతేదీ వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్1861 ప్రకారం 91 రోజులు పాటు నిషేధాజ్ఞలు అమలు లో ఉంటాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిషేధాజ్ఞలు అమలు ఉన్న సమయంలో పోలీస్ కమీషనరేట్ పరిధి లో ఎటువంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు, నిరసన, ధర్నా కార్యక్రమాలును పోలీస్ వారి ముందస్తు అనుమతి లేకుండా నిర్వహించరాదని, నిషేధాజ్ఞలు అతిక్రమించి నిర్వహించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.

యువటూరి ప్రసాద్‌బాబుకు ఘన సత్కారం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా పలువురు రంగస్థల నటులు వివిధ రూపాలను ప్రదర్శించారు.వాస్తవం ఏక పాత్రాభినయం ద్వారా ప్రస్తుత సమాజం లో జరుగుతున్న కుటుంబాలలో జరిగే పరిస్థితులను హృద్యంగా కళ్లకు కట్టినట్టు చూపించారు.నటులు శ్రీ యువటూరి ప్రసాద్ బాబు ను డాక్టర్ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్,కార్యదర్శి కొండా య గుంట రాము,కోశాధికారి గుర్రం ఏడు కొండలు,ఉపాధ్యక్షులు మండా రాము.పొలవరపూ రాజారావు తదితరులు ఘనంగా సత్కరించారు.

ఒలంపియాడ్ ఫలితాల్లో చైతన్య విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-కంచికచర్ల: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఒలింపియాడ్ ఫలితాలలో శ్రీ చైతన్య కంచికచర్ల విద్యార్థులు తమ ప్రతిభను చూపారు.మొత్తం 128 మంది విద్యార్థులు ఐ ఎన్ టి ఎస్ ఓ రెండోవ స్థాయి పరీక్ష రాయగా119 మంది విద్యార్థులు 59 బంగారు పతకాలు, ల్యాబ్ టాప్ వంటి మరెన్నో విలువైన బహుమతులు గెలుచుకోవడం గర్వకారణం అని , మాథ్స్ -32, ఇంగ్లీష్-23, జీ కే -29, సైన్స్-35,సామర్థ్యాల సాధనలో -2 స్థానాలు సాధించారని హెచ్ఎం సుధాకర్ తెలిపారు.

ఎస్ఆర్ఆర్ క్రీడాకారిని అనూషకు ఘన సన్మానం

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ఈనెల 19 నుండి 23 వరకు జరిగిన 19వ సీనియర్ నేషనల్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్షిప్ మహిళల విభాగంలో కళాశాల విద్యార్థిని ఆంధ్రప్రదేశ్ మహిళా విభాగంలో ప్రాతినిధ్యం చేసి రెండు కాంస్య పథకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కే. భాగ్యలక్ష్మి తెలిపారు., ఈ క్రీడాకారిని మిగతా విద్యార్థులు కూడా క్రీడలలో పాల్గొని ఎక్కువ బహుమతులు తేవాలని తద్వారా కళాశాలకు మరియు రాష్ట్రానికి పేరు తేవాలని కళాశాల ప్రిన్సిపల్ తెలియజేశారు. ఈ క్రీడాకారి ని గోవా లొ జరగబోయే 37 వ జాతీయ క్రీడా పోటీలలొ పాల్గొంటుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వ్యాయామ విద్య విభాగ్యపతి డాక్టర్ ఎం కోటేశ్వరరావు, డాక్టర్ డి. యుగంధర్ మరియు కళాశాల అధ్యాపక అధ్యాపకేతర విద్యార్థులు అనూషకు శుభాకాంక్షలు తెలియజేశారు.

కరుమూరి అమ్మన్ శక్తి పీఠంలో ఏడీసీపీ వెంకటరత్నం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): సివిసర్‌పై ఓవర్ బ్రిడ్జీ పక్కనున్న స్వయంభూ శ్రీ దేవి కరుమారి అమ్మన్ శక్తి పీఠంలో మంగళవారం ఉదయం విజయవాడ ఏ డి సి పి(క్రైమ్) వెంకట రత్నం ప్రత్యేక పూజలు నిర్వహించారు.తొలుత కరుమారి అమ్మన్ శక్తి పీఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కరుమారి దాసు,అర్చకులు దీక్షితులు, పీఠం ట్రస్ట్ కోశాధికారి జ్ఞానేశ్వర్, వెంకటేశ్వరరావు, మహిళలు ఆలయ మర్యాదలతో సంప్రదాయం ప్రకారం ఆమెకు ఘన స్వాగతం పలికారు. శాలువా, అమ్మవారి చీరను కానుకగా సమర్పించారు. ఈ సందర్భంగా ఏ డి సి పి వెంకట రత్నం మాట్లాడుతూ ....అమ్మవారి ని దర్శించుకోవడం తాము ఎంతో అనిర్వచణియ అనుభూతిని పొందామని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ కరుమారి దాసు శక్తి పీఠం వద్ద ఏప్రిల్ 27 నుండి మే 3 తేదీవరకు జరగనున్న సహస్ర చండీ యాగం వివరాలను వివరించారు. ఈ పూజ కార్యక్రమంలో వెంకట రత్నం, నవమల్లెతీగ సాహిత్య మాస పత్రిక సంపాదకులు కలిమిశ్రీ, పత్రిక సీనియర్ సబ్ ఎడిటర్ చొప్పా రాఘవేంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని విధాలుగా ఎదగాలన్నదే లక్ష్యం

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని విధాల ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అందుకే మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేశామన్నారు.ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలోని సి.ఏ కన్వెన్షన్ హాల్లో వైఎస్సార్ ఆసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాసనసభ్యులు శ్రీ వసంత వెంకట కృష్ణప్రసాదు మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మండలం, కొండపల్లి మున్సిపాలిటీలో 1759 సంఘాలలోని అక్కచెల్లెమ్మలకు రూ.17,36,21,465లను మూడో విడత ఆసరా కింద విడుదల చేసినట్లు వెల్లడించారు. ఈ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కొండపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి

విశాలాంధ్ర-విజయవాడ : బందరు రోడ్డులోని ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.సాంబిరెడ్డి, ఎం.వి.ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొగ్రలాజపురంలోని బెల్లపు శోభనాద్రి గ్రంథాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బందరు రోడ్డు పొడవునా ఫుట్‌పాత్‌లు నిర్మించాలన్నారు. భవనాలలోకి కార్లు వెళ్లే గేట్ల వద్ద కూడా పాదచారులు రోడ్డు మీదకు వెళ్లే అవసరం లేకుండా నడవటానికి వీలుగా ఫుట్‌పాత్‌లు నిర్మించాలని సూచించారు. నగరంలోని అన్ని ప్రధాన రోడ్లకు ఫుట్‌పాత్‌లు నిర్మించాలని డిమాండ్ చేశారు.

పేకాట శిబిరంపై దాడి

విశాలాంధ్ర-వీరులపాడు: మండలంలోని నందలూరు గ్రామ శివారులో కోడిపందాలు నిర్వహిస్తున్న శిబిరంపై ఎస్ఐ సోమేశ్వరరావు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన తెలిపారు.రెండు కోళ్లు, రెండు కోడి కత్తులు, రూ.6570ను స్వాధీనం చేసుకొన్నట్లు సోమేశ్వరరావు తెలిపారు. 11 బైకులు స్వాధీనం చేసుకున్నారు.

రక్తహీనత నివారణకు తాటి బెల్లం శ్రేష్టం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : రక్తహీనతను నివారించడంలో తాటిబెల్లం ఎంతో శ్రేష్టమైనదని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల బాలికలకు 30 రోజుల పాటు తాటి బెల్లం పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. విజయవాడ పాయకపురం ప్రభుత్వ సాంఘీక సంక్షేమ వసతి గృహ బాలికలకు మంగళవారం కలెక్టర్ తాటి బెల్లం పంపిణీ చేశారు. జిల్లా వ్యాప్తంగా సాంఘీక సంక్షేమ వసతి గృహ బాలికలకు తాటి బెల్లం పంపిణీతో పాటు ప్రస్తుతం అందిస్తున్న ఐరన్ పోలిక్ యాసిడ్ టాబులెట్లకు ఇస్తున్నట్లు వివరించారు.

రహదారి విస్తరణకు రైతులు సహకరించాలి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : విజయవాడ టు హైదరాబాద్ ఎన్‌హెచ్ 65 జాతీయ రహదారి విస్తర్ణలో భాగంగా నందిగామ, అంబారుపేట వద్ద అవసరమైన భూ సేకరణకు మార్కెట్ ధర నిర్ధారణకై మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, స్థానిక తహాశీల్దార్ నరసింహారావు, రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతుల వద్ద నుండి సేకరించాల్సిన భూమి వివరాలు, మార్కెట్ ధరను అంచనా వేసి ప్రభుత్వానికి నివేధిక సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఏ ఒక్కరికి నష్టం కలగకుండా నిబంధనల మేరకు మార్కెట్ ధరను నిర్ణయిస్తామని జాతీయ రహదారి విస్తరణకు రైతులు సహకరించాలని జేసీ కోరారు.

నగర పరిధిలో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలి : జేసీ

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : నగర పరిధిలోని పెట్రోల్ బంకుల వద్ద విద్యుత్ వాహనాలకు చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రికల్ వాహనాలకు చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుపై మంగళవారం పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ(ఎన్ఆర్ఈడీసీఏపీ) నగర పాలక సంస్థ పరిధిలోని హెచ్‌పీసీఎల్, ఐవోసీ, బీపీసీఎల్ ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, పౌర సరఫరాల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నగరంలో వివిధ ఆయల్ కంపెనీలకు సంబంధించి ఉన్న 50 పెట్రోల్ బంకుల్లో ఎలక్ట్రికల్ వాహనాలకు చార్జింగ్ స్టేషన్లకు పాయింట్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. నాలుగు చక్రాల వాహనాలకు సంబంధించి 5 పెట్రోల్ బంకుల్లో ఏర్పాటు చేయాలని మిగిలిన అన్ని పెట్రోల్ బంకులలోను ద్విచక్ర వాహనాలకు చార్జింగ్ స్టేషన్ పాయింట్లు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పర్యవారణ అనుకూల ఎలక్ట్రిక్‌తో నడిచే వాహనాలను ప్రోత్సహిస్తున్నాయని ఇందుకు సంబంధించి చార్జింగ్ స్టేషన్లను విరివిగా ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్‌వో పీ.కోమలిపద్మ, హెచ్‌పీసీఎల్, ఐవోసీ, బీపీసీఎల్ ఆయిల్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు ఏలూరు జిల్లా, కైకలూరు మండలం, గోపవరం,పంచాయితీ ఆఫీసు దగ్గర, డోర్ నెం: 2-6రు, కాపురస్తులు 1)దండే లాజాసు గారి కుమారుడు దండే పాల్, 2) దండే పాల్ గారి భార్య పదిరి హెచ్.నిర్మల కుమారి గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా...

యన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం, నిడమానూరు గ్రామ డోర్ నెం: 6-136రు కాపురస్తులు 1) జాలాది లేటు వెంకటేశ్వరరావు గారి భార్య జాలాది వెంకటేశ్వరమ్మ, 2) జాలాది లేటు వెంకటేశ్వరరావుగారి కుమారుడు జాలది త్రినాథ్ గారు వారి వారసత్వంగా వారి సంక్రమించిన ఆస్తిని, ది.22/07/2008న విజయవాడ రూస్ (గుణదల) సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో జాలది వెంకటేశ్వరరావు గారు, షేక్ నిజాముద్దీన్ గారి కుమారుడు మస్తాన్ గారి వద్ద నుండి క్రయం పొంది దస్తావేజు నెం:2358/2015గా రిజిస్ట్రారు పొంది తదాది సర్వసంపూర్ణ హక్కులతో అనుభవించున్నా ఆస్తిని,సదరు జాలది వెంకటేశ్వరరావుగారు ది.16-10-2009న ఆస్తి ఏలాంటి ఏర్పాటు చేయకుండా యింటస్టేట్ గా పరమపదించినారు, ఆ తదుపరి వారసులైన 1) జాలాది వెంకటేశ్వరమ్మ 2) జాలాది త్రినాథ్ గార్ల వద్ద నుండి ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి నా క్లయింటు కొనుగోలు చేయుటకు బయాన ఇచ్చి వారి వద్ద నుండి అగ్రిమెంట్ చేసికొని యున్నారు. కావున సదరు సేల్ అగ్రిమెంట్ పై ఏమైన అభ్యంతరము లున్నచో ఈ ప్రకటన వెలువడిన 10 రోజుల లోపు ఈ క్రింది అడ్రసు కు లిఖిత పూర్వకంగా తెలియ చేయగలరు. ఏవిధమైన అభ్యంతరాలు రానిచో నిర్వివాద ఆస్తిగా బావించి మిగత క్రయధనం చెల్లించి సక్రమమైన రిజిస్ట్రారు దస్తావేజును నాక్లయింటు పొందుటకు ఏర్పాటు చేసికొని యున్నారు. గడువు తదుపరి వచ్చు ఏలాంటి క్లెయిములు నా క్లయింట్ ను బైండు చేయజాలవని తెలియజేయడమైనది

షెడ్యూలు:- యన్.టి.ఆర్ జిల్లా, గుణదల సబ్ రిజిస్ట్రారు వారి యీలకా నిడమానూరు గ్రామ పంచాయితి ఏరియాలో లో చేరిన గ్రామ సర్వే నెం: 159/4రు, గల దాఖలా ఆస్తికి హద్దులు:-

1వఅయిటం:-తూర్పు:అయినపూడి సాంబశివరావు గారి ఆస్తి, అ.35.0లు దక్షిణం: నంంకర కోటేశ్వరరావు యితరులకు విక్రయించిన ఆస్తి అ.47.0లు, పడమర: అలపాటి చిట్టెమ్మ గారి ఆస్తి అ.30.0లు ఉత్తరం: అరికపూడి సీతామహాలక్ష్మీ, చంద్ర రామచంద్రరావు గారికి విక్రయించిన ఆస్తి మరియు 2వ అయిటం ధాఖలా ఆస్తి. అ.47-0లు యీ హద్దుల మధ్య 169-6చ.గ లు లేక 141.80చ.మీలు స్థిరాస్తి నివేశన స్థలం లో చ.అ.918లు శ్లింతేరియా గల గ్రౌండ్ ఫ్లోరు, గల ఆర్.సి.సి బిల్డింగ్‌కు గల ఫిటింగ్స్ సహా

2వఅయిటం:-తూర్పు:అయినపూడి సాంబశివరావు గారి ఆస్తి, అ.24.6లు దక్షిణం: 1వ అయిటం ధాఖలా ఆస్తి అ.08-0లు పడమర: అరికపూడి సీతామహాలక్ష్మీ, చంద్ర రామచంద్రరావు గారికి విక్రయించిన ఆస్తి అ.24-6లు, ఉత్తరం: పంచాయితీ రోడ్డు యీ నాలుగు హద్దుల మధ్య చ.గ. 21-77లు లేక చ.మీ 18.20ల్లు స్థిరాస్తి దారిస్థలము. 1,2 అయిటంలు వెరశి చ.గ.191లు లేక 160.03ల్లు స్థిరాస్తి నివేశన స్థలము నందు గ్రౌండ్ ఆర్.సి.సి దాబా యింటితో సహా మరియు సదరు ఆస్తికిగల యావత్ యీజ్‌మెంట్ హక్కులతో

ఇట్లు:-

మట్టిపల్లి సుగుణరావు,
అడ్వకేటు-నోటరీ
సిటీ వర్క్‌షాప్స్,యం.ఆర్.ఓ ఆఫీసు ఎదుట, పర్వతంవారివీధి, గాంధీనగర్, విజయవాడ-2
ఫోన్:9848150589